
సిద్దిపేటలో దీపాలు వెలిగిస్తున్న యువతులు


వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వైభవంగా కార్తీక దీపోత్సవం

సిద్దిపేట కల్చరల్/చేర్యాల/వర్గల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా సిద్దిపేట ఉమాపార్థివ కోటి లింగేశ్వర స్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేపట్టారు స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం క్షేత్ర సన్నిధిలో నిర్వహించిన సామూహిక దీపోత్సవంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలు వెలిగించి స్వామివారిని వేడుకున్నారు. వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కార్తీక సోమవారం సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక సహస్ర దీపాలంకరణ సేవ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ వైభవంగా ప్రారంభించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయంలో కార్తీకమాసంలో అన్ని రోజులు 1008 కార్తీక దీపాలు వెలిగించేందుకు మహిళా భక్తులకు ఆలయం నుంచి మట్టి ప్రమిదలు, ఒత్తులు, నూనె పంపిణీ చేయనున్నట్లు ఈవో అన్నపూర్ణ తెలిపారు. ప్రత్యేక పర్వదినం సందర్భంగ ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అలాగే కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలోనూ కార్తీక దీపోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం తరఫున ప్రమిద, ఒత్తులు, నూనె అందించగా, భక్తులు జ్యోతులు వెలిగించారు


సిద్దిపేటలోని కోటిలింగేశ్వర ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, యువతులు


కొమురవెల్లి మల్లన్న ఆలయంలో నిర్వహించిన కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు




మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్

రోగుల రిపోర్టులను ఎప్పటికప్పుడు
అప్‌లోడ్ చేయాలి : డీఎంహెచ్‌వో

సిద్దిపేటటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ రోగ నిర్ధారణ పరీక్షల రిపోర్టులను నిర్ణీత సమయంలో(ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో) అప్‌లోడ్ చేయాలి. ఏ మాత్రం పెండింగ్ ఉంచకూడదు. ఈ బాధ్యత ల్యాబ్ టెక్నీషియన్లపై ఉందని సిద్దిపేట డీఎంహెచ్‌వో డాక్టర్ పల్వన్‌కుమార్ సూచించారు. సోమవారం సిద్దిపేటలోని జిల్లా వైద్యశాఖాధికారి కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్ల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైద్యుల సూచనల మేరకు ల్యాబ్ టెక్నీషియన్లు అన్ని రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి ఎప్పటికప్పుడు టీహబ్‌కు పంపాలన్నారు. టీహబ్‌తో అనుసంధానమై ఉండి పరీక్ష ఫలితాలను ప్రజలకు చేరవేసేలా బాధ్యతలు నిర్వర్తించాలని చెప్పారు. ప్రతి ఒక్క ల్యాబ్ టెక్నీషియన్ బాధ్యతగా పనిచేసి పీహెచ్‌సీకి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ఈనెల 10న నిర్వహించే రెగ్యులర్ నియామక పరీక్షలను బాగా రాయాలని ఆయన ఆకాంక్షించారు. సమయపాలన పాటించని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, వైద్య సిబ్బంది కాల్వ చక్రధర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 పరీక్షకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. జిల్లాలో 37 సెంటర్లలో 13,408 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. అభ్యర్థులు ఒకరోజు ముందే సెంటర్లను చూసుకోవాలని, కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబోరన్నారు. నవంబరు 16, 17, 18 తేదీల్లో కరెంటు కోతలు ఉండకూడదని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలని చెప్పారు. ప్రతీసెంటర్ వద్ద వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు.

సమగ్ర సర్వేతో
ప్రైమరీపై ఎఫెక్ట్!

- విధుల్లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు
- సర్వే పూర్తయ్యే వరకు ఒంటిపూట బడులు
- విద్యార్థుల చదువుపై ప్రభావం!
- అందరినీ భాగస్వాములను చేయాలంటున్న ఉద్యోగ సంఘాలు




సిద్దిపేట కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే రేపటి (బుధవారం) నుంచి ప్రారంభం కానుంది. అయితే, ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. సుమారుగా 3 వారాల పాటు జరిగే ఈ సర్వేకు 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్‌ను ప్రభుత్వం నియమించింది. ఇప్పటికే నివాసాలకు స్టిక్కరింగ్ చేయడంలో సిబ్బంది బిజీగా ఉన్నారు.

సర్వే కోసం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు

ఈనెల 6 నుంచి చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేపై పలు ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, వివిధ వర్గాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సర్వే నిర్వహించే విధానం సరికాదన్న అభిప్రాయమూ లేకపోలేదు. ఈ సర్వే కోసం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని, ఈ మేరకు ప్రాథమిక పాఠశాలలను ఒంటిపూట కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మధ్యాహ్నం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడే అసలు సమస్య వస్తుంది. పట్టణాల సంగతి పక్కన పెడితే గ్రామాల్లో పిల్లలను స్కూలుకు పంపి కుటుంబసభ్యులు పొలం పనుల కోసం వెళ్తారు. వారు తిరిగి సాయంత్రం కానీ ఇంటికి రారు. ఆ సమయంలో పిల్లలను ఇంటికి పంపించడం సరికాదని పలువురు టీచర్లు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఇక సర్వే కోసం మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లినా అందరూ అందుబాటులో ఉండకపోవచ్చు. దీని వల్ల ఉపాధ్యాయులకు పనిభారం పెరిగే అవకాశం ఉంది. గత నెలలో దసరా సందర్భంగా పదిరోజులపైన సెలవులు ఇచ్చారు. ఇప్పుడు సర్వే కారణంగా మూడు వారాలపాటు ఒంటిపూట బడులు నిర్వహింటం వల్ల విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతుంది. వచ్చే ఏడాది అడ్మిషన్లపై కూడా ఎఫెక్ట్ పడుతుందని ఉపాధ్యాయ సంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఇదే నెల చివరి వారం లేదా వచ్చే నెల మొదటివారంలో న్యాస్ పరీక్ష కూడా ఉంటుంది. జాతీయస్థాయిలో విద్యార్థుల విద్యాప్రమాణాల నిర్ధారణ కోసం నిర్వహించే ఈ పరీక్షకు విద్యార్థులను సంసిద్ధులుగా చేయాల్సిన ఈ సమయంలో మూడు వారాల పాటు సర్వే విధుల్లో ఉపాధ్యాయులు, ఒంటిపూట కారణంగా సెలవుల్లో విద్యార్థులు ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నష్టం జరిగే అవకాశాలున్నాయి. అయితే సర్వే చేపట్టే విధానంలో మార్పులు చేస్తే ఎవరికీ ఇబ్బంది లేకుండా ఉంటుందని పలు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. కేవలం ప్రైమరీ స్కూలు టీచర్లనే కాకుండా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను, మరికొన్ని శాఖల ఉద్యోగుల సేవలను తీసుకుని రెండు, మూడు రోజుల్లో పూర్తిచేసే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. సర్వేకూడా సాఫీగా పూర్తవుతుందని స్పష్టం చేస్తున్నారు.

ఇక ఈ సర్వేలో కుటుంబసభ్యులందరూ ఉండాల్సిన అవసరం లేదు. ఎవరో



సమగ్ర కుటుంబ సర్వే నమునా

మిగతా 6వ పేజీలో...

'ప్రజావాణి'కి 46 దరఖాస్తులు

- కలెక్టర్ మనుచౌదరి


ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి అర్జీలను అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 46 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. సదరం రీ అసైన్‌మెంట్‌కు హైదరాబాద్‌కు పంపొద్దని, సిద్దిపేట ఏరియా ఆసుపత్రిలోనే నిర్వహించాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం వారు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందిస్తూ సిద్దిపేటలోనే నిర్వహించేలా ఏర్పాటు చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, వివిధశాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇప్పించండి

- బుచ్చయ్య, ఆరేపల్లి, హుస్నాబాద్ మండలం

హుస్నాబాద్‌లో ఫర్టిలైజర్ దుకాణంలో సూపర్ కంపెనీకి సంబంధించిన నకిలీ వరి విత్తనాలను కొని మోసపోయాం. మాకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి. పంటను పరిశీలించిన అధికారులు కూడా నకిలీ విత్తనం వల్లే నష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు. ఆ కంపెనీ నుంచి త్వరగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.

బడి.. బాగుపడింది

- మూతపడే దశ నుంచి.. మురిపించే స్థాయికి
- పాఠశాల ఉపాధ్యాయుడు ఓంకార్ కృషి ఫలితం 5
- 2012లో పదిమందే విద్యార్థులు.. నేడు 212 మంది
- ఆదర్శం అంగడికిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల

క్రీడా సంబురం

- సిద్దిపేటలో సీఎం రేవంత్‌రెడ్డి క్రికెట్ టోర్నీకి సర్వం సిద్ధం
- ఈనెల 8 నుంచి పోటీలు ప్రారంభం
- హాజరుకానున్న మంత్రులు, కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి క్రికెట్ ట్రోఫీ పేరిట పోటీలను నిర్వహించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సిద్దిపేటలోని స్టేడియాన్ని సిద్ధం చేశారు. ఈనెల 8 నుంచి డిసెంబరు 31 వరకు పోటీలను పూర్తిచేసేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సిద్దిపేట నియోజకవర్గం నుంచి 260 జట్లు పేర్లు నమోదు చేసుకున్నాయి. సోమవారం ఇరు జట్ల మధ్య పోటీల కోసం డ్రా తీశారు. ప్రతిరోజూ 6 నుంచి 8 మ్యాచ్‌లు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పోటీలను మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌లు ప్రారంభించనున్నారు. కౌన్సిలర్లు సాకిబాల్‌లక్ష్మీఆనంద్, రియాజుద్దీన్, ముత్యాల శ్రీదేవిబుచ్చిరెడ్డి పర్యవేక్షించనున్నారు.

గెలుపొందిన జట్టుకు రూ.లక్ష బహుమతి

సీఎం రేవంత్‌రెడ్డి క్రికెట్ టోర్నీకి సంబంధించి ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుకు రూ. లక్ష బహుమతి అందించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. రన్నరప్ జట్టుకు రూ. 50 వేలు, టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారుడికి రూ.50వేలు, బెస్ట్ బౌలర్‌కు రూ. 25 వేలు అందించనున్నారు.


సిద్దిపేట పట్టణంలోని క్రికెట్ స్టేడియం

ఘనంగా సదర్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలోని దీకొండ మైసమ్మ ఆలయం వద్ద కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమ ఎల్లం యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై మాట్లాడారు. సదర్ పండుగను అధికారికంగా నిర్వహించటంపై సీఎం రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. నటుడు శివారెడ్డిని గత ప్రభుత్వం పట్టించుకోలేదని, సీఎం దృష్టికి తీసుకెళ్లి శివారెడ్డికి సరైన న్యాయం జరిగేలా చూస్తానన్నారు. అంతకు ముందు శివారెడ్డి తన మిమిక్రీతో అందరినీ అలరించారు. హర్యానా నుంచి ప్రత్యేకంగా తెప్పించిన దున్నపోతుల విన్యాసాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు, ఉత్సవ నిర్వాహకులు పయ్యావుల సందీప్ పాల్గొన్నారు.




సదర్ వేడుకలో మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు


సదర్ వేడుకకు హాజరైన జనసందోహం


ఎల్లారెడ్డిపేటలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

తేమ నెపంతో
రైతులను వేధించొద్దు

- దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు 5

ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్ షురూ



గెలుపొందిన నిజామాబాద్ జట్టు

కొండాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండాపూర్ మండలం సీ.హెచ్.కోనాపూర్‌లో అండర్-23 ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ప్రారంభమైంది. స్థానిక ఎం.ఎ.క్రికెట్ గ్రౌండ్‌లో మెదక్ జిల్లా-నల్గొండ జిల్లా జట్లు తలపడగా, ఎస్‌వీఆర్ గగన్ క్రికెట్ గ్రౌండ్‌లో నిజామాబాద్ జిల్లా-కరీంనగర్ జిల్లా జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. టాస్ గెలిచిన బ్యాటింగ్ చేసిన నల్గొండ జట్టు 44 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మెదక్ జిల్లా జట్టు 182 పరుగులకే ఆలౌట్‌కాగా, 25 పరుగులతో నల్గొండ జట్టు గెలుపొందింది. మరో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 39.2 ఓవర్లలో 168 పరుగులకే ఆలౌట్ అయింది. తర్వాత నిజామాబాద్ జట్టు 30.5 ఓవర్లలోనే 172 పరుగులు చేసి విజయం సాధించినట్లు మెదక్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు మర్రిముస్త్యాల యువతి



భవిష్యరెడ్డి

చేర్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన నక్కల భవిష్య రెడ్డి వాలీబాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఇటీవల అండర్-17విభాగంలో తమిళనాడు రాష్ట్రం కోటగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో నక్కల భవిష్యరెడ్డితో కూడిన తెలంగాణ జట్టు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ క్రమంలో ఈ నెల 6 నుంచి 10 తేదీ వరకు యూపీ రాష్ట్రంలోని బరేలీలో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొననుంది. ఈ మేరకు భవిష్యరెడ్డికి స్థానికులు అభినందనలు తెలిపారు.

ఒకప్పుడు పట్టుమని పదిమంది విద్యార్థులే ఉన్న ఆ పాఠశాల నేడు వందలమందితో కళకళలాడుతున్నది. నాడు శిథిలమైన తరగతి గదులు, అరకొర వసతులతో కొట్టుమిట్టాడిన ఆ బడి.. నేడు అధునాతన హంగులతో విద్యార్థులకు చదువుల ఒడిగా మారి అక్కున చేర్చుకుంటున్నది. జిల్లాలోనే మొట్టమొదటి ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక పాఠశాల కూడా ఇదే. ఇదంతా ఒక ఉపాధ్యాయుడి కృషితో దాతలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల సహకారంతోనే సాధ్యమైంది. అప్పట్లో ఆదరణకు నోచని.. నేడు అందరి మన్ననలు పొందుతున్న అంగడి కిష్టాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలపై ప్రత్యేక కథనం



2012లో పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయుడు ఓంకార్



ప్రైవేటుకు దీటుగా విద్యార్థులకు యూనిఫాం, షూ, ఐడీ కార్డులతో ప్రస్తుత విద్యార్థులు

బడి.. బాగుపడింది..

మూతపడే దశ నుంచి.. మురిపించే స్థాయికి..

- పాఠశాల ఉపాధ్యాయుడు ఓంకార్ కృషి ఫలితం
- 2012లో పదిమందే విద్యార్థులు.. నేడు 212 మందితో కళకళ
- ఆంగ్ల మాధ్యమంలో బోధన, సకల సౌకర్యాలకు నిలయం
- ఆదర్శం అంగడికిష్టాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

మర్కుక్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇతర స్కూళ్లకు ఆదర్శంగా నిలుస్తున్నది. ఒకప్పుడు మాసిపోయిన గోడలు.. బడి ప్రాంగణమంతా కుక్కలు, పందుల సంచారం.. కేవలం పది మంది విద్యార్థులతో మూతపడే దశలో ఉన్న బడి.. ఓంకార్ అనే ఉపాధ్యాయుడి కృషితో ప్రస్తుతం దాని రూపురేఖలే మారిపోయాయి.

కారణాలు తెలుసుకుని..

2003 డీఎస్సీలో ఓంకార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికై ఉమ్మడి మెదక్ జిల్లా కల్హేర్ మండలం అంతర్గావ్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహించాడు. అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా 2009 ఆగస్టు 25న నేటి మర్కుక్ మండలం పాతూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మూడేళ్లు పనిచేశాడు. అక్కడి నుంచి మళ్లీ సాధారణ బదిలీపై 2012లో అంగడికిష్టాపూర్ పాఠశాలకు వచ్చారు. బడి పరిసరాలు, విద్యార్థుల కొరత అతడిలో నిరాశను కలిగించింది. ఇక్కడ అప్పటికే విధులు నిర్వహిస్తున్న తోటి టీచర్ నుస్రత్‌ను పాఠశాల దుస్థితికి గల కారణాలను అడిగి తెలుసుకున్న ఓంకార్ ఏదేమైనా పాఠశాల బాగుపరచాలని సంకల్పించుకున్నారు. అప్పటి నుంచి రెండేళ్ల పాటు అధ్యయనం చేసి విద్యార్థులు ఈ పాఠశాలకు రావడానికి ఆసక్తి చూపకపోవడానికి గల కారణాలను కనుగొన్నాడు. అందులో ప్రధాన కారణాలు ఆంగ్ల మాధ్యమ బోధన, వసతుల సరిగా లేకపోవడమేనని తెలుసుకున్నాడు. ఇక 2014 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా నాడు నూతనంగా ఎన్నికైన సర్పంచ్ దుద్దెడ రాములుగౌడ్, యువజన సంఘాల నాయకులు, గ్రామస్థుల సహకారంతో బడిని తీర్చిదిద్దాలన్న తన నిర్ణయాన్ని అందరిముందుంచాడు.



అంగడికిష్టాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

కార్పొరేట్ హంగులు..

మాటల్లో చెప్పి వదిలేయకుండా ఓంకార్ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. దాతలు, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, యువజన సంఘాల నాయకులు, తల్లిదండ్రుల సహకారంతో ఆంగ్ల మాధ్యమాన్ని అందుబాటులోకి తేవడంతోపాటు పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో అన్ని హంగులు సమకూర్చడంలో సఫలీకృతమయ్యాడు. దీంతో ఇది రాష్ట్రంలోనే ఉత్తమ ప్రభుత్వ పాఠశాలగా నిలిచింది. రానురాను బడిలో విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వచ్చి నేడు 212 మందికి చేరింది. 2015 సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో నాటి గడా అధికారి హన్మంతరావు ప్రత్యేక చొరవ తీసుకుని పాఠశాలకు మరో టీచర్ పోస్టును మంజూరు చేయించారు. ఆ పోస్టులో వచ్చిన ఉపాధ్యాయుడే రామకృష్ణారెడ్డి. చేబర్తి నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఓంకార్‌తో జతకట్టి పాఠశాలను ఉన్నత శిఖరాలకు చేర్చాడు. వారి పిల్లల్నీ ఇదే బడిలో చదివించి ఆదర్శంగా నిలిచాడు. కాగా, ఓంకార్ రెండు పర్యాయాలు ఉమ్మడి మెదక్ జిల్లా, ఒకసారి నూతన సిద్దిపేట జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారాలు అందుకున్నాడు.

పాఠశాల దత్తత తీసుకున్న అప్పటి సీపీ..

లా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్ చేయడం కోసం సిద్దిపేట జిల్లా మొట్టమొదటి పోలీస్ కమిషనర్ శివకుమార్ అప్పట్లో పల్లెనిద్ర నిర్వహించారు. అందులో భాగంగా అంగడికిష్టాపూర్ గ్రామానికి వచ్చిన ఆయనకు ఈ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో నచ్చాయి. దీంతో ఆయన పాఠశాల వివరాలను, స్థితిగతులపై ఆరా తీసి పాఠశాలతోపాటు గ్రామాన్ని దత్తత తీసుకుని అన్ని విధాలుగా తీర్చిదిద్దేందుకు తనవంతు సహకారం అందించారు. ప్రధానంగా నేరరహిత అంగడికిష్టాపూర్‌ను గ్రామంగా మార్చి జిల్లాలోని ఆదర్శంగా నిలిపారు.

ప్రముఖుల సందర్శన..

ఈ పాఠశాల గురించి తెలుసుకున్న పలువురు ప్రముఖులు సందర్శించి తమవంతు సహకారాన్ని అందిరచారు. నాటి గడా హన్మంతరావు చొరవతో స్థానిక సర్పంచ్ రాములుగౌడ్ ఆధ్వర్యంలో మొదటి పాఠశాల వార్షికోత్సవంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, తదుపరి వార్షికోత్సవంలో నాటి కలెక్టర్ వెంకట్రాంరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అప్పుడు ఇక్కడి విద్యార్థుల ప్రతిభకు ఆకర్షితుడై ఏకంగా రూ.10 లక్షలను పాఠశాల అభివృద్ధికి, మరో 10 లక్షలను గ్రామపంచాయతీ అభివృద్ధికి అందించారు. అంతేకాకుండా పాఠశాల అదనపు తరగతి గదులు, గ్రామంలో యువజన సంఘం భవనం, లైబ్రరీ, మహిళా భవనాలను కూడా మంజూరు చేశాంనను. అనంతరం ప్రశాంత్ జీవన్ పాటిల్ ఐఏఎస్, నాటి ట్రైనింగ్ ఐఏఎస్ ముజామిల్‌ఖాన్, సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గారిమా అగర్వాల్, పాఠశాలంపపు సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.

తేమ నెపంతో రైతులను వేధించొద్దు

- దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

తొగుట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తేమశాతం నెపంతో కొనుగోలు కేంద్రాల వద్ద పత్తి రైతులను వేధిస్తే ఊరుకునేదిలేదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అధికారులను హెచ్చరించారు. సోమవారం సాయంత్రం తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని వెంకటేశ్వర కాటన్ ఇండస్ట్రీలో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులవైపు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతులకు న్యాయం చేయడం కోసమే కేంద్ర ప్రభుత్వం పత్తికి క్వింటాలుకు రూ.7,512 మద్దతు ధర నిర్ణయించిందన్నారు. రైతులు పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 లోపు ఉండేలా చూసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ ఉపసంయుక్త సంచాలకుడు ప్రసాద్‌రావు, సీసీఐ సెంటర్ ఇన్‌చార్జి సాయిచంద్, మార్కెట్ కమిటీ కార్యదర్శి స్వామి, పరమేశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు చంద్రం, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్‌గౌడ్, నర్సింహులు, స్వామిరెడ్డి, కళ్యాణ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

స్విమ్మింగ్‌లో విద్యార్థి ప్రతిభ

- అభినందించిన అదనపు కలెక్టర్

సంగారెడ్డి అర్బన్/సంగారెడ్డి రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణానికి చెందిన శ్లోకాస్ శ్రీవాణి హైస్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి మహ్మద్ అబ్దుల్ రహమాన్‌సిద్ధిఖ్ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో మూడవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ఆ విద్యార్థిని అభినందించి జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్‌అలీ మాట్లాడుతూ స్విమ్మింగ్‌లో విద్యార్థి ప్రతిభ కనబర్చడం జిల్లాకే గర్వకారణమన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా విద్యార్థికి నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో పద్మజా, డీవైఎస్‌వో ఖాసీంబేగ్, టీఎన్‌జీవో కార్యదర్శి వి.రవి, ప్రిన్సిపాల్ హసన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీకాంత్, వెంకటరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మృతిచెందిన చిన్నారులకు తోటి విద్యార్థుల నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు

మనోహరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండలం పోతారం గ్రామంలో మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఇద్దరు చిన్నారులు సహస్ర, సాన్వీలకు తోటి విద్యార్థులు నివాళులర్పించారు. సోమవారం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ 2 నిమిషాలు మౌనం పాటించారు. కొవ్వొత్తులు వెలిగించి చిన్నారులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు మాధవి, శర్మిల, రాజేశ్వర్‌రెడ్డి, అంగన్వాడీ టీచర్ తులసి, ఏఎన్ఎం జానబాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గడ్డిమందు తాగిన యువకుడు


- చికిత్సపొందుతూ మృతి



స్వామి(ఫైల్)

సిద్దిపేట రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో యువకుడు గడ్డిమందు తాగగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణరావుపేట మండలం మాటిండ్ల గ్రామానికి చెందిన పొన్నాల స్వామి (22) వృత్తి రీత్యా డ్రైవర్. పలుచోట్ల అప్పు చేసి ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. వీటి ఎలా తీర్చాలంటూ నిత్యం ఇంట్లో చెబుతూ దిగాలుపడేవాడు. ఈ క్రమంలో అక్టోబరు 31న రాత్రి గడ్డి మందు ఇంటికి తెచ్చుకుని తాగాడు. గమనించిన తండ్రి రాములు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుని అన్న పొన్నాల బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నకోడూరు పోలీసులు తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్మికుడు ఆత్మహత్య



మనోహర్ మృతదేహం

మాసాయిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలం స్టేషన్ మాసాయిపేట గ్రామ పంచాయతీ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామ పంచాయతీలో పనిచేసే మండే మనోహర్(60) కుమారుడు ఇటీవల మరణించాడు. దీన్ని జీర్ణించుకోలేని మనోహర్ జీవితంపై విరక్తి కలిగి ఆదివారం రాత్రి స్టేషన్ మాసాయిపేట వద్ద గల ఫంక్షన్ హాల్ వద్ద ఇనుప రాడ్డుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి




రమేష్(ఫైల్)

నర్సాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన రోటమ్ రమేష్(28) కులవృత్తిలో భాగంగా సోమవారం ఉదయం గ్రామ చెరువులోకి చేపలవేటకు వెళ్లాడు. ఈ క్రమంలో అతడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

రూ.30 వేల జీతమంటూ మోసం

- రూ. 6వేలు కాజేసిన కేటుగాళ్లు



నట్‌రాజ్ కంపెనీ లిమిటెడ్‌లో జాయిన్ అయినట్లు పంపించిన గేట్ పాస్

మద్దూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లు జాబ్ ఆశ చూపి యువకుడి నుంచి డబ్బులు కాజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మద్దూరు మండలం ధర్మారం పిట్టలకాలనీవాసి కాలియా సతీష్ ఫోన్‌లోని వాట్సాప్‌కు ఆదివారం హిందుస్థాన్ పెన్సిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చిరునామాతో ఆల్ ఇండియా ఫ్యాక్టరీ పేర పెన్సిల్ ప్యాకింగ్ జాబ్, నెలకు రూ.30వేల జీతమంటూ మెసేజ్ వచ్చింది. దీంతో అతడు అందులోని నంబరుకు ఫోన్ చేయగా.. ఒక్కో ప్యాకెట్‌కు 10 పెన్సిళ్ల చొప్పున రోజుకు 100 ప్యాకెట్లు చేస్తే.. రూ.వెయ్యి లభిస్తుందని చెప్పడంతో చేరేందుకు ఒప్పుకున్నాడు. జాయినింగ్ కోసం ఆధార్‌కార్డు, ఒక పాస్ ఫొటో, ప్రస్తుత చిరునామాతో రిజిస్ట్రేషన్‌కై తాము పంపించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి రూ.650 చెల్లించాలని చెప్పడంతో అలాగే చేశారు. అనంతరం వారు ఐడీ కార్డు (గేట్ పాస్) తయారు చేసి పంపించడంతో సతీష్ నిజమేనని నమ్మాడు. అప్పటి నుంచి పలు దఫాలుగా వేర్వేరు కారణాలు చెప్పి రూ.6వేల వరకు లాగారు. జీఎస్టీ పేరుతో మరోసారి డబ్బులు పంపించాలని మెసేజ్ రావడంతో మోసపోయానని గుర్తించిన సతీశ్ సోమవారం మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కమర్షియల్ పైలెట్‌గా యశస్విని



పైలెట్‌గా ఎంపికైన యశస్విని

గజ్వేల్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో కమర్షియల్ పైలెట్‌గా ఎంపికైన యువతి అందరి మన్ననలు అందుకుంటుంది. గజ్వేల్ మండలం దాచారం గ్రామానికి చెందిన వేముల మురళి, వసుందర దంపతులకు కొడుకు, కూతురు యశస్విని ఉన్నారు. రామాయణపేటలోని మురళి ఎస్‌బీలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా, కామారెడ్డి జిల్లాలో వసుందర ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. వీరి కూతురు యశస్విని మహారాష్ట్రంలోని పూణేలో పైలెట్‌గా శిక్షణ పొంది. ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో అన్ని దశల ఇంటర్వ్యూలను దాటుకొని కమర్షియల్ పైలెట్‌గా ఉద్యోగం సాధించింది. యశస్విని గ్రామస్థులు అభినందిస్తున్నారు.

ప్రజాపాలన పుస్తక సంకలనంలో

'పిన్నింటి' రచనలు



పుస్తకంతో పిన్నింటి రత్నం

చేర్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఇటీవల 80 పాటల సంకలన పుస్తకం రూపొందించబడింది. రాష్ట్రవ్యాప్తంగా పలువురు కవులు రచనలందించగా, కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన పిన్నింటి రత్నం జానపద శైలిలలో రచించిన రెండు పాటలను సంకలనంలో ముద్రించారు. ఈ మేరకు ఆయనను స్థానికులు, కవులు, సాహితీవేత్తలు అభినందించారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొండపాక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన కొండపాక మండలం దుద్దెడ శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగింది. అక్బర్ పేట-భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామనికి చెందిన ముచ్చనపల్లి స్వామి(35) దుద్దెడ శివారులో గల పూజ పౌల్ట్రీఫాంలో కూలీ పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున నడుచుకుంటూ దుద్దెడ నుంచి పౌల్ట్రీకి వెళ్తుండగా దుద్దెడ గ్రామ శివారులో జియో పెట్రోల్ పంపు దగ్గర హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో స్వామి తలకు బలమైన గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

దుబ్బాక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తిమ్మాపూర్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆకారం గ్రామానికి చెందిన కోతి చంద్రం(30)కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని 108 అంబులెన్స్ సిబ్బంది ఎల్లప్ప, ప్రభాకర్ సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 51 మందికి జరిమానా

గజ్వేల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 51 మందికి రూ.33 వేల జరిమానా విధిస్తూ గజ్వేల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ఆయా చౌరస్తాల్లో ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 51 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.33 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని తెలిపారు.

సిద్దిపేటలో 24 మందికి..

సిద్దిపేట క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో కొన్నిరోజుల నుంచి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాల్లో, రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 24 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపర్చగా విచారణ చేసి 24 మందికి రూ.41 వేల జరిమానా విధించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- రూ.3,690 నగదు, ఆరు మొబైల్స్ స్వాధీనం

బెజ్జంకి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కల్లెపల్లి గ్రామ శివారులో కొంతమంది కలిసి పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారంపై సోమవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు కలిసి వెళ్లి దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,690 నగదు, ఆరు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

కలెక్టర్‌ను కలిసిన డీఎంహెచ్‌వో

సిద్దిపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా డీఎంహెచ్‌వోగా నియమితులై, బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పల్వన్‌కుమార్ సోమవారం సిద్దిపేటలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ప్రారంభించదు.. ఐకేపీ కొనుగోలు చేయదు..

- వరికోతలు ప్రారంభమై 20 రోజులు
- ఇంకా తెరుచుకోని కొనుగోలు కేంద్రాలు
- అకాల వర్షాలకు తడుస్తున్న ధాన్యం
- ఆందోళనలో రైతన్నలు



లకుడారంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించక ముందే కొనుగోలుకు సిద్ధంగా ఉన్న ధాన్యం

కుకునూరుపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే కొనుగోలు కేంద్రాలు.. కుకునూరుపల్లి మండలంలో నేటివరకూ ప్రారంభించలేదు. అలాగే ఐకేపీ ఆధ్వర్యంలోనూ కొనుగోలు ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో చిన్నకిష్టాపూర్, లకుడారం, కుకునూరుపల్లి, మంగోల్, రాయవరం గ్రామాల్లో ప్రతి ఏడాది పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తారు. మిగతా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు జరుగుతాయి. వరికోతలు ప్రారంభమై 20 రోజులు దాటినా నేటివరకూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం గమనార్హం. కుకునూరుపల్లి, చిన్నకిష్టాపూర్ గ్రామాల్లో సన్నవడ్లను కొనుగోలు చేస్తామని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. సన్నవడ్లు కొనుగోలు కేంద్రాలకు వచ్చే పరిస్థితి లేదు. రైతులు తమ కుటుంబం కోసం మాత్రమే సన్నవడ్లను పండిస్తుంటారు.

తడుస్తున్న ధాన్యం

వానాకాలం ముగిసినా అకాల వర్షాలతో ధాన్యం నీటి పాలవుతుంది. గతేడాది ఎక్కడైతే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారో.. పీఏసీఎస్ సిబ్బంది తెలిపిన స్థలాల్లోనే రైతులు ధాన్యం ఆరబెడుతున్నారు. ఆరబెట్టిన వడ్లు ఇటు తడుస్తూ.. అటు ఎండుతూ కొనుగోలు కేంద్రాల్లో మూలుగుతున్నాయి. వివిధ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 15 రోజులు అవుతున్నా.. కొనుగోళ్లు మాత్రం జరగలేదని రైతులు వాపోతున్నారు. కోసిన ధాన్యాన్ని ఎప్పుడు కొనుగోలు చేస్తారోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్న రైతులు

ఐకేపీ కొనుగోలు చేయకపోవడం, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ధాన్యాన్ని ఆరబెట్టడం, జల్లి పట్టడం వంటివి చేసిన తర్వాత వర్షం వస్తే పరిస్థితి ఏంటని కొందరు రైతులు ప్రైవేట్ వ్యాపారులు వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు వచ్చి వడ్లను రూ.1,800 నుంచి రూ.2000 వేల వరకు, ఆరబెట్టిన వడ్లకు తేమశాతం 17 ఉంటే రూ.2,200లకు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

పత్తి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి

గజ్వేల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి అధికారులను కోరారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని ఈశ్వరసాయి జిన్నింగ్ మిల్లులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మార్కెట్ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. వారితో మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్‌రెడ్డి, వహీద్, రామాగౌడ్, హరినాథ్, శ్రీనివాస్ ఉన్నారు.



గజ్వేల్ పట్టణంలోని జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

●కొండపాక/సిద్దిపేట కలెక్టరేట్: కొండపాక మండలం ఆరేపల్లి శివారులోని స్వాతి కాటన్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని సిద్దిపేట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ప్రారంభించి మాట్లాడారు. మిల్లు యజమాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ కార్యదర్శి పరమేశ్వర్ తదితరులున్నారు.

●జగదేవ్‌పూర్: జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని గొల్లపల్లి రోడ్డులో గల శ్రీనివాస కాటన్ ఇండస్ట్రీలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని గజ్వేల్ మార్కెట్ కమిటీ చెర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సర్దార్‌ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

- పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీలక్ష్మి

గజ్వేల్/గజ్వేల్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికుంటు వ్యాధిపట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్, సిద్దిపేట జిల్లా ముఖ్య పర్యవేక్షణ అధికారి డాక్టర్ శ్రీలక్ష్మి అన్నారు. గజ్వేల్ మండలం కొడకండ్లలో సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేసే కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. గాలికుంటు వ్యాధి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునే క్రమంలో ప్రభుత్వం అవగాహన కల్పిస్తూ, ఉచితంగా నివారణ టీకా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కాగా కొడకండ్లలో 159 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేసినట్లు గజ్వేల్ పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ బాబు పేర్కొన్నారు. గాలికుంటు టీకా కార్యక్రమంలో సింగాటం పశువైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, సిద్దిపేట జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ కొండల్‌రెడ్డి, డాక్టర్ రమేష్‌బాబు, వీఎల్‌వో సంజీవ్, కిరణ్, శంకర్, గోపాలమిత్ర క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



గాలికుంట వ్యాధి నివారణ టీకా వేస్తున్న శ్రీలక్ష్మి

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట: డీఐఈవో రవీందర్‌రెడ్డి

గజ్వేల్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సిద్దిపేట జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ బాలికల ఎడ్యుకేషన్‌హబ్‌లో జరుగుతున్న సిద్దిపేట జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బాలబాలికల క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తున్న యువతను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మానసిక, శారీరక వికాసానికి ఆటలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్‌గౌడ్, జ్యోతిర్మయి, పీడీ రవి తదితరులు పాల్గొన్నారు.



చేర్యాల మండలం షబాషీగూడెం నుంచి జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం సాల్వాపూర్ వరకు బీటీ రోడ్డు మరమ్మతులు పూర్తిచేయాలని సీపీఎం నాయకులు సోమవారం మోకాళ్లపై కూర్చుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు.

- చేర్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి)

'దళారులను నమ్మి మోసపోవద్దు'

మర్కుక్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. సోమవారం మర్కుక్‌లో ప్యాక్స్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మాజీ జడ్పీటీసీ మంగమ్మరామచంద్రం, మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్, మండల వ్యవసాయ అధికారి డాక్టర్ నాగేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ స్వామి, నరసన్నపేట తాజా మాజీ సర్పంచ్ మాధవి రాజిరెడ్డి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు యాదగిరిలతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలనర్సయ్య, రాములుగౌడ్, ప్యాక్స్ డైరెక్టర్ సంజీవులు, పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్, గాలేష్‌బాబు, లక్ష్మయ్య, కనకయ్య, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన



సిద్దన్నపేట మార్కెట్‌యార్డు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

నంగునూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు చేయాలని నంగునూరు మండలం సిద్దన్నపేట మార్కెట్ యార్డు ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. నెలరోజులుగా ధాన్యం ఆరపెట్టి మార్కెట్‌కు తీసుకొచ్చినా కొనడం లేదన్నారు. గతంలో వరికోతలు ప్రారంభంలోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తరలించేవారని, ప్రస్తుతం నెలరోజులుగా రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ వెంటనే ధాన్యం కొనుగోలు చేసి కనీస మద్దతు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు.

కేంద్రాలు లేకనే ధాన్యం దళారుల పాలు

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేపట్టకపోవడం వల్ల గ్రామాల్లోని ధాన్యం దళారుల పాలవుతున్నదని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్ తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు సూరం పరశురాములు పాల్గొన్నారు.

మత్స్యకారులు అభివృద్ధి చెందాలి: రజిత



ఎల్లమ్మ చెరువులో చేపపిల్లలను వదులుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే ఉచిత చేప పిల్లలతో మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వం ఇచ్చిన లక్షా 50 వేల చేపపిల్లలను హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువులో వదిలి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు పున్న లావణ్య, బొల్లి కల్పనశ్రీనివాస్, బాలరంగం, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు సురేష్, డైరెక్టర్ అయిలయ్య, పొన్నాల మల్లయ్య, బాలయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్



హుస్నాబాద్ రూరల్: పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు

గజ్వేల్/హుస్నాబాద్ రూరల్/అక్కన్నపేట/సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు/మిరుదొడ్డి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సర్పంచుల బిల్లులను ప్రభుత్వం చెల్లించాలని గజ్వేల్ మండల మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. సర్పంచుల నిరసన కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో చేపట్టనున్న సందర్భంగా గజ్వేల్ మాజీ సర్పంచులు పాశం బాపురెడ్డి, తోట లక్ష్మయ్య, దాసరి మహేందర్, గుణిశెట్టి బాల్‌చంద్రం, పొందును పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. హుస్నాబాద్ మండలంలోని మాజీ సర్పంచులు తొడేటి రమేష్, సుగుణ-శ్రీనివాస్, మల్లయ్య, సంపత్, జనార్దన్, గీకురు వెంకటేశంను పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కన్నపేట మండలంలోని మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని మాజీ సర్పంచులు హంసకేతన్‌రెడ్డి, శంకర్ పేర్కొన్నారు. మాజీ సర్పంచులను అక్రమంగా అరెస్టు చేయించడం సరికాదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్ అన్నారు. చిన్నకోడూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మాజీ సర్పంచులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు బాల్‌రాజు, శ్రీనివాస్‌లు మండిపడ్డారు.

టీడీపీకి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేయాలి

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నర్సింహులు

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కార్యకర్తలు కృషిచేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు పేర్కొన్నారు. హుస్నాబాద్‌లో పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీడీపీ సభ్యత్వ నమోదుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. టీడీపీ నాటి నుంచి నేటివరకూ పేదల పక్షపాతిగా పని చేస్తున్నదన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.2 లక్షలు ఉన్న బీమాను రూ.5 లక్షలకు పెంచారన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర సత్యం, విద్యార్థి విభాగం మాజీ అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్, కోటి, మనోహర్ సదానందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సింహులు

విద్యార్థి జీవితం నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలి

గజ్వేల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితం నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు చట్టాలు, మహిళల రక్షణకు ఏర్పాటుచేసిన బృందాలు, సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించారు. జీవితంలో ఏం సాధించాలన్నా విద్యార్థి దశ కీలకమన్నారు. ఆయనవెంట ప్రిన్సిపల్ సుధారాణి, గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ, షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, సిబ్బంది శ్యామల, లావణ్య, మహేశ్, రాంచంద్రారెడ్డి ఉన్నారు.

'సమగ్ర' సర్వేతో ప్రైమరీపై ఎఫెక్ట్!

3వ పేజీ తరువాయి..

ఒకరు కుటుంబ వివరాలు అధికారులకు ఇస్తే సరిపోతుంది. సర్వేను ప్రశ్నావళి రూపంలో నిర్వహిస్తారు. మొత్తం 75 ప్రశ్నలకు సమాచారం సేకరిస్తారు. కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగత వివరాలు, విద్య, ఉద్యోగ, ఉపాధి, భూములు, రిజర్వేషన్ ప్రయోజనాలు, ఆస్తులు ఆదాయం, అప్పులు గురించి సమాచారం తీసుకుంటారు. విద్యార్థులకు నష్టం జరగకుండా సర్వే చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అదరాసుపల్లి శశిధర్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి తెలిపారు.

శిక్షణ అందిస్తున్నాం

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా రేపటి నుంచి సర్వే మొదలవుతుంది. ఇందు కోసం అవసరమైన శిక్షణను ఎన్యూమరేటర్లకు ఇస్తున్నాం. జిల్లాలోని మండల పరిషత్, జిల్లా పరిషత్, అర్బన్ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, కేజీబీవీ ప్రైమరీ ఉపాధ్యాయులు, పీఈటీలు, ఐఈఆర్పీలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఎఎన్ఎంలు విద్యాశాఖ సిబ్బంది మొత్తంగా 1833 మంది ఈ సర్వేలో ప్రత్యక్షంగా పరోక్షంగా భాగమవుతున్నారు.

- రామస్వామి, జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్

కులగణనను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్, మండల ప్రత్యేకాధికారి సువర్ణ



గజ్వేల్‌లోని ఐవోసీలో ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

గజ్వేల్/కొండపాక/మద్దూరు/కుకునూరుపల్లి/హుస్నాబాద్ రూరల్, కుకునూరుపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కులగణనను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్, మండల ప్రత్యేకాధికారి సువర్ణ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐఓసీలోని సీ బ్లాక్‌లో కులగణన నిర్వహించే ఎన్యూమరేటర్లకు సర్వేపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారితో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య, మండల విద్యాధికారి కృష్ణ, ఎంపీవో దయాకర్ తదితరులున్నారు. కొండపాకలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మద్దూరులో తహసీల్దార్ ఎండీ ఏజీ రహీం ఆధ్వర్యంలో, కుకునూరుపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి అధ్యక్షతన, హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు ఆర్డీవో రామ్మూర్తి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే మర్కుక్ మండల కేంద్రంలో తహసీల్దార్ ఆరిఫా, మండల ప్రత్యేకాధికారి, అదనపు పీడీ బాలకిషన్, ఎంపీడీవో అబ్జలుద్దీన్‌తో కలిసి సర్వేపై అవగాహన కల్పించారు.

రైతాంగ శ్రేయస్సుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతాంగ శ్రేయస్సుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో బోగారి సునీత, భోగిని అనిత అనే రైతులు మృతిచెందగా, వారికి సంబంధించిన రూ.5 లక్షల రైతుబీమా ప్రొసీడింగ్స్‌ను సోమవారం ఆయన అందజేశారు. ఆయనవెంట గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, గజ్వేల్ మండల వ్యవసాయాధికారి నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్ రామాగౌడ్, కరుణాకర్‌రెడ్డి, నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

6న ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల హక్కుల కోసం, అడవుల సంసరక్షణ కోసం సమాజంలో తన మేధస్సుతో అలుపెరగని పోరాటం చేసిన ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను 6న హుస్నాబాద్ పట్టణంలో.. జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై చైతన్యం చేసిన సాయిబాబాను కక్షపూరితంగా కేంద్ర ప్రభుత్వం 10 ఏళ్ల జైల్లో పెట్టిందన్నారు. ఈ సమావేశంలో జేఏసీ కో కన్వీనర్ మేకల వీరన్నయాదవ్, ద్యాగల సారయ్య, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మహిళా కానిస్టేబుల్

బెజ్జంకి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగించి ఓ మహిళా కానిస్టేబుల్ మానవత్వం చాటుకుంది. మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన జంగం అజయ్‌కు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఐదురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం బెజ్జంకి పోలీస్ స్టేషన్ సమీపంలో కనిపించడంతో గమనించిన మహిళా కానిస్టేబుల్ సౌజన్య అతడి వివరాలు తెలుసుకుని కుటుంబసభ్యులకు అప్పగించింది. దీంతో సౌజన్యకు యువకుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



యువకుడిని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న మహిళా కానిస్టేబుల్

మిరుదొడ్డి తహసీల్దార్‌గా హరికిషన్

మిరుదొడ్డి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మిరుదొడ్డి మండల తహసీల్దార్‌గా హరికిషన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన గోవర్ధన్ బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు. సిద్దిపేట రూరల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న హరికిషన్ మిరుదొడ్డికి బదిలీపై వచ్చారు. కాగా బాధ్యతలు స్వీకరించిన హరికిషన్‌ను డిప్యూటీ తహసీల్దార్ వీరేష్, ఆర్ఐలు కొండల్‌రెడ్డి, రాజ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

'హోమియోపతి మందులతో ఆరోగ్యం'

ములుగు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హంస హోమియోపతి మందులతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ ఉమేష్ పేర్కొన్నారు. సోమవారం ములుగు మండలం బండమైలారంలో హంస హోమియోపతి వైద్య కళాశాల ఆస్పత్రి పరిశోధనా కేంద్రం, ఎన్ఎస్ఎస్ విభాగం కమ్యూనిటీ మెడిసిన్ సంయుక్తంగా గ్రామ ఆరోగ్యంపై సర్వే చేశారు. గత సంవత్సరం విద్యార్థులు(ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు) ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేయడంతో బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు ఉన్నట్లు తెలిసింది. దీంతో వారికి సంబంధించిన వ్యాధులకు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అక్కలాదేవి, పద్మజ, మండల అభివృద్ధి అధికారి నరసింహారావు పాల్గొన్నారు.

'రెవెన్యూ డివిజన్ సాధించే వరకూ విశ్రమించం'

చేర్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల రెవెన్యూ డివిజన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసేంత వరకూ అవిశ్రాంత పోరాటం కొనసాగిస్తామని జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ అన్నారు. చేర్యాల పట్టణంలో సోమవారం జేఏసీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొ.జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈనెల 30న స్థానిక అంగడిబజారులో సంకల్ప దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు పుర్మ ఆగంరెడ్డి, తోకల ఉమారాణి, కామిడి జీవన్‌రెడ్డి, అంకుగారి శశిధర్‌రెడ్డి, ఆడెపు నరేందర్, తడక లింగమూర్తి, మంచాల చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

'గ్రంథాలయాలు విజ్ఞాన దీపికలు'

కోహెడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన దీపికలని మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కోహెడ మండలం బస్వాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. టీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజు ఆధ్వర్యంలో పాఠశాలలో ఉన్న గ్రంథాలయానికి 300లకు పైగా పుస్తకాలు, బీరువాను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజు, సుధాకర్‌రెడ్డిని మాజీ ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కొక్కుల రమేష్, కొక్కుల సురేష్, మాజీ ఉపసర్పంచ్ అంజయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.